సాక్షి అనకాపల్లి

ఆదివారం । 21 । జూలై । 2024



అడవివరం ప్రధాన మార్గంలో రథోత్సవం, కిక్కిరిసిన భక్తజనం

అప్పన్న సన్నిధికి అడుగులో అడుగేస్తూ..

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు





తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



గంగిరెద్దుకి నమస్కరిస్తున్న భక్తులు

- వర్షం తెరిపివ్వడంతో తరలివచ్చిన భక్తులు
- ఉదయం 7 గంటల నుంచే ప్రదక్షిణ ప్రారంభించిన భక్తజనం
- సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభం



ఎంవీపీ డబుల్ రోడ్డులో భక్తజన సందోహం

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణ శనివారం వైభవంగా జరిగింది. 32 కి.మీ గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ఉదయం 7 గంటల నుంచే తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చారు. తొలిపావంచా నుంచి ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైలు, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్,



పుష్పరథ యాత్ర ప్రారంభిస్తున్న అశోక్ గజపతిరాజు

డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మినగర్, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకున్నారు. వర్షం తెరిపివ్వడంతో భక్తులు ఉత్సాహంగా ప్రదక్షిణ చేశారు.

విశేషంగా రథయాత్ర

కొండదిగువ స్వామివారి తొలిపావంచా వద్ద శనివారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు రథంలో ఉన్న స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకున్న భక్తులు స్వామినామస్మరణ చేస్తూ రథాన్ని అనుసరించారు. తొలిపావంచా నుంచి ప్రారంభమైన రథయాత్ర అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, సత్యం జంక్షన్, ఎన్ఏడీ కొత్త రోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంది. రథోత్సవంలో దేవస్థానం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పులివేషాలు, కేరళ డ్రమ్స్, కోలాటం, కాళీ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



స్వచ్ఛంద సంస్థల సాయం

గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. గిరిప్రదక్షిణ జరిగే 32 కి.మీ కొండచుట్టూ 29 ప్రదేశాల్లో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. అక్కడ జీవీఎంసీ తాగునీరు అందుబాటులో ఉంచింది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 11 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 29 స్టాల్స్‌లో భక్తులకు మందులు అందజేశారు. 22 ప్రదేశాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. 17 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో 2,600 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఆహార పదార్థాలు, స్నాక్స్, పానీయాలు అందజేశాయి.

సైడ్ లైట్స్

- గిరి ప్రదక్షిణకు ఉదయం 7 గంటల నుంచే భక్తులు సింహాచలం చేరుకున్నారు. వర్షం తెరిపివ్వడంతో ఉదయం 10 గంటల నుంచి ఒక్కసారిగా రద్దీ పెరిగింది. మధ్యాహ్నం సమయానికి విపరీతంగా రద్దీ నెలకొంది. రథోత్సవం సమయానికి స్వామివారి తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు భక్తులు కిక్కిరిశారు.
- ఉదయం 7 గంటలకే ప్రదక్షిణ ప్రారంభించిన పలువురు భక్తులు సాయంత్రం 6 గంటలకే తిరిగి సింహాచలం చేరుకున్నారు. అలా చేరుకున్న వారందరికీ రాత్రి 10 గంటల వరకు సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి దర్శనాలు కల్పించారు.
- తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టే భక్తుల సౌకర్యార్థం ఈసారి 50 వరకు క్యూలు, 80 ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేశారు.
- కొత్త ఘాట్‌రోడ్డు వద్ద కొబ్బరి కాయలు కొట్టేందుకు 20 వరకు గడ్డర్లు ఏర్పాటు చేసినా అక్కడ కొబ్బరికాయలు కొట్టేందుకు భక్తులు పెద్దగా ఆసక్తి చూపలేదు.
- తొలిపావంచా వద్ద ఎప్పటికప్పుడు కొబ్బరి చెక్కలు తరలించేందుకు క్రేనులు, పెద్ద సంఖ్యలో లారీలు ఏర్పాటు చేశారు.
- తొలిపావంచా వద్ద తీవ్ర రద్దీ నెలకొనడంతో భక్తులు రోడ్లపైనా, దేవస్థానం బస్టాండ్‌లోని బీఆర్‌టీఎస్ రోడ్డు సరిహద్దు గోడపైనా కొబ్బరికాయలు కొట్టారు.
- నగరంలో నుంచి గోపాలపట్నం మీదుగా పాత గోశాల వైపు వచ్చే వాహనాలను పాతగోశాల జంక్షన్‌కి సమీపంలో నిలుపుచేశారు. అక్కడి నుంచి తొలిపావంచా వద్దకు భక్తులు నడిచి వెళ్లారు. మధ్యాహ్నం నుంచి మరింత రద్దీ ఏర్పడటంతో గోపాలపట్నం నుంచి, వేపగుంట నుంచి కూడా సింహాచలం వరకు అధిక సంఖ్యలో భక్తులు నడిచి వెళ్లాల్సి వచ్చింది.
- ఈసారి బీఆర్‌టీఎస్ రోడ్డు విశాలంగా ఉండటంతో అడవివరం వైపు వచ్చే భక్తులందరినీ తొలిపావంచాకి ప్రధాన మార్గంలోనే పంపించారు.

అప్పుఘర్‌లో స్నానాలు లేవు

గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో అప్పుఘర్ తీరం పోటెత్తింది. వాతావరణ ప్రభావంతో అలల ఉధృతంగా వస్తున్న కారణంగా ఈ ఏడాది భక్తులను సముద్ర స్నానానికి అనుమతించలేదు. గజ ఈతగాళ్లు అందించే సముద్ర నీరును భక్తులు తలపై చల్లుకుని వెనుదిరిగారు. అలాగే మాధవధారలో ఉన్న మాధవస్వామిని భక్తులు దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆలయం వద్ద స్నానాలు ఆచరించారు.



తలపై నీళ్లు చల్లుకుంటున్న భక్తులు



భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీపీ బాగ్చి





తొలి పావంచా వద్ద స్వామికి నమస్కరిస్తూ..



అప్పుఘర్ వద్ద ప్రసాద వితరణ

న్యూస్‌రీల్

జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్

- జీసీసీ ఎండీగా కల్పనా కుమారి
- అల్లూరి జేసీగా అభిషేక్ గౌడ్
- రంపచోడవరం ఐటీడీ పీవోగా సింహాచలం



సంపత్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : మహావిశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్‌గా పి.సంపత్‌కుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 2016 బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సాయికాంత్ వర్మని బదిలీ చేసిన తర్వాత జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కలెక్టర్ హరేందర ప్రసాద్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు పూర్తిస్థాయిలో కమిషనర్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఎండీగా కల్పనా కుమారిని నియమించారు. ప్రస్తుతం జీసీసీ ఎండీగా విధులు నిర్వర్తిస్తున్న జి.సురేష్‌కుమార్‌ని బదిలీ చేశారు. అదేవిధంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ జీఎస్ ధనుంజయ్‌ను పల్నాడు జేసీగా బదిలీ చేశారు. ఈయన స్థానంలో కట్టా సింహాచలంకు బాధ్యతలు అప్పగించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సచివాలయాల అదనపు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అభిషేక్ గౌడ్‌ని నియమించారు.

ఘాట్‌రోడ్లలో భారీ వాహనాల నిషేధం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఘాట్‌రోడ్లలో భారీ వాహనాలు,బస్సులు,ప్రైవేట్ జీపులు,ఇతర వాహనాల రవాణాపై రాత్రి 7గంటల నుంచి ఉదయం 6గంటల వరకు నిషేధం అమలు జేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.పాడేరు–వద్దాది ఘాట్‌రోడ్డు,పాడేరు–చింతపల్లి రోడ్‌లో కొక్కిరాపల్లి ఘాట్, చింతపల్లి–నర్సీపట్నం రోడ్డులో లంబసింగి ఘాట్, రంపచోడవరం–చింతూరు ఘాట్‌రోడ్డు, ఎస్.కోట–అరకు ఘాట్ రోడ్డుల్లో వర్షాలు తగ్గే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు.

పెరుగుతున్న నీటిమట్టాలు



దేవరాపల్లి: ఇంటి శ్లాబ్ ముందు భాగం కూలిపోయిన ప్రాంతాన్ని సందర్శించిన సర్పంచ్ జగన్



మాడుగుల రూరల్: పెద్దేరు జలాశయం నీరు విడుదల చేసిన దృశ్యం

మాడుగుల రూరల్: పెద్దేరు జలాశయంలో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.80 మీటర్లకు చేరింది. జలాశయం పరిసరాల్లో 60 మి.మీ. వర్షపాతం నమోదైంది. 250 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ నుంచి 300 క్యూసెక్కుల నీటిని శనివారం రాత్రి అధికార్లు స్పిల్ వే గేట్ల ద్వారా విడుదల చేసినట్లు జలాశయం జేఈ సుధాకర్ రెడ్డి చెప్పారు. జలాశయం పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కళ్యాణపులోవ, కోనాం రిజర్వాయర్ల నీటిమట్టం కూడా పెరుగుతోంది.

ఎం.అలమండలో విరిగిపడ్డ ఇంటి శ్లాబ్

దేవరాపల్లి: ఎం.ఆలమండలో శుక్రవారం రాత్రి ఇంటి ముందు భాగంలో శ్లాబ్ పోర్టికో విరిగిపడింది. రాత్రి పది గంటల తర్వాత ఒక్కసారి భారీ శబ్దంతో కుప్పకూలడంతో ఇంటిలో నివాసం ఉంటున్న సూరిశెట్టి లక్ష్మి, భర్త అప్పారావు, కుమారుడు, కోడలు, ఇద్దరు చిన్నపిల్లలు బయటకు పరుగులు తీశారు. సర్పంచ్ దాడి జగన్, ఎంపీటీసీ పోతల వెంకటరావు తదితరులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని పరామర్శించారు. ఎంపీడీవో అప్పలరాజు, ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని శనివారం ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని వేరే ఇంటిలోకి తరలించారు.

ముంపునకు గురైన నారుమడుల పరిశీలన



మునగపాకలో నారుమడులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

మునగపాక: గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు ముంపునకు గురైన నారుమడులను శనివారం జిల్లా వ్యవసాయాధికారి డి.మోహనరావు, సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.రామారావు పరిశీలించారు. మునగపాక, వాడ్రాపల్లి గ్రామాల్లో వారు పర్యటించి రైతులతో మాట్లాడారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు నారుమడుల్లో నీరు నిలిచిపోవడాన్ని గమనించిన వారు రైతులకు పలు సూచనలు చేశారు. ముంపునకు గురైన నారుమడుల్లో నీరు బయటకు పోయేలా చూడాలన్నారు. అయిదు సెంట్ల నారుమడికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా 2 గ్రాముల మాంకోజెల్‌ను పిచికారీ చేయాలన్నారు. అలాగే కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు చేయించుకోవాలన్నారు. ఏఈవో లక్ష్మి, వీఏఏలు గౌరీ సింధూజ, సత్య రవిరాజ్, తులసి, పాల్గొన్నారు.

రేపటి నుంచి కాకినాడకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు

అనకాపల్లి: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి డిపో నుంచి కాకినాడకు ఈనెల 22 నుంచి నూతన ఎక్స్‌ప్రెస్ సర్వీసు ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీసు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రతి రోజు ఉదయం 6.30 గంటలకు బయలుదేరి చోడవరం చేరుకొని, 7.30 గంటలకు అక్కడ బయలుదేరి అనకాపల్లి మీదుగా యలమంచిలి 9 గంటలకు, తుని 10.30, కాకినాడ 11.30 గంటలకు చేరుతుందని తెలిపారు. కాకినాడలో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి తుని, యలమంచిలి, అనకాపల్లి మీదుగా విశాఖ చేరుకుంటుందన్నారు. విశాఖలో సాయంత్రం 4.30కి బయలుదేరి అనకాపల్లి వస్తుందని చెప్పారు. చోడవరం నుంచి తుని, కాకినాడకు వెళ్లే ప్రయాణికులకు, కార్గోలో వస్తువులు పంపించే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.

సింహగిరి ప్రదక్షిణకు 10 ప్రత్యేక బస్సులు

సింహాచలం గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అనకాపల్లి డిపో నుంచి సింహాచలం కొండ వద్దకు 10 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఇన్‌చార్జి డిపో మేనేజర్ రవిచంద్ర శనివారం చెప్పారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

పెద్దేరు, తాచేరు నదుల ఉధృతి

- విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్డుపై నిలిచిన రాకపోకలు.. మూడు జిల్లాల ప్రజలకు ఇక్కట్లు
- బీఎన్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభిస్తామని ఎంపీ రమేష్ ఎన్నికల హామీ
- గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సిద్ధంగా ఉన్నా కదలని పనులు
- మాట నిలబెట్టుకుంటే ఇప్పుడు కష్టాలు ఉండేవి కావని జనం నిట్టూర్పు



విజయరామరాజుపేటలో దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న డీపీవో శిరీషా రాణి, ఇతర అధికారులు

బుచ్చెయ్యపేట: పెద్దేరు, తాచేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విజయరామరాజుపేటలో డైవర్షన్ రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడంతో రహదారి దెబ్బతింది. శనివారం సాయంత్రం మూడు గంటల నుంచి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వడ్డాదిలో డైవర్షన్ రోడ్డును ఆనుకుని నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. డైవర్షన్ రోడ్లపై నుంచి వాహనదారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎంపీగా ఎన్నికైన వెంటనే ఈ ప్రాంతంలో పర్యటించిన సీఎం రమేష్.. బీఎస్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభిస్తామని చెప్పారని, అది కార్యరూపం దాలిస్తే ఈరోజు ఇంత ఇబ్బంది ఉండేది కాదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రమేష్ తాను ఎంపీగా గెలిస్తే ముందుగా భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డు పనులు ప్రారంభించి ప్రజలకు రవాణా సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఎంపీ హోదాలో విజయరామరాజుపేట వద్ద కూలిన తాచేరు వంతెనను, డైవర్షన్ రోడ్డును అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. కూలిన తాచేరు వంతెన నిర్మాణానికి ఆరు కోట్ల రూపాయలతోపాటు వెంకన్నపాలెం నుంచి వడ్డాది వరకు బీఎస్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.37 కోట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నిధులు మంజూరైనట్లు ఆర్ అండ్ బీ అధికారుల ద్వారా ఎంపీ తెలుసుకున్నారు. నిధులుండటంతో చేస్తున్న పనులు ఆపొద్దని, వెంటనే ప్రారంభించాలని ఎంపీ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పనులు వేగంగా జరిగితే నిధులు వెంటనే మంజూరయ్యేలా చూస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

ఆదేశించి నెల రోజులు దాటినా..

టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ కావడంతో గతంలో నిర్మాణ పనులు నత్తనడకన సాగేవి. కూటమి ప్రభుత్వం రావడంతో ఇక బీఎస్ రోడ్డు పనులు జోరుగా సాగుతాయని, ఎంపీ చొరవ తీసుకుంటే అది మరింత సులభతరం కాగలదని అంతా భావించారు. కాని ఎంపీ సీఎం రమేష్ ఆదేశించి నెల రోజులు దాటినా పేట డైవర్షన్ రోడ్డు వద్ద గుప్పెడు మట్టి కూడా వేయలేదు. గత ప్రభుత్వంలో వేసిన డైవర్షన్ రోడ్డు గ్రావెల్ మట్టి అంతా కొట్టుకుపోయి పెద్దపెద్ద గోతులు పడినా అధికారులు పట్టించుకోలేదు. శనివారం డైవర్షన్ రోడ్డుపై నుంచి తాచేరు వంతెన నీరు ప్రవహించడంతో డీపీవో శిరీషా రాణి, తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎంపీడీవో వెంకటాచార్య, ఎస్ఐ డి.ఈశ్వరరావు తదితర్లు ప్రమాదాలు జరుగుతాయని గమనించి బీఎస్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేయించారు. దీంతో పాడేరు, విశాఖపట్నం, నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే మూడు జిల్లాల ప్రజలకు రవాణా కష్టాలు ఎదురయ్యాయి. ఈ రహదారుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు బుచ్చెయ్యపేట, గౌరీపట్నం, మంగళాపురం ఇరుకు రహదారుల పైనుంచి రాకపోకలు సాగిస్తూ కష్టాలు పడుతున్నారు. తక్షణం పేట వద్ద డైవర్షన్ రోడ్డునైనా తాత్కాలికంగా ఏర్పాటు చేసి రవాణా సదుపాయం కల్పించాలని మూడు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

మూడో రోజూ అదే జోరు

సాక్షి, అనకాపల్లి: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శనివారం కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మూడు రోజులపాటు కురిసిన వానలతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. అల్పపీడనం తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అయినా మరో 24 గంటలు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తహసీల్దార్లకు సూచించారు. ఇటీవల రైతులు వేసిన వరి మడుల్లో వర్షపు నీరు భారీగా చేరింది. ఈ నీరు బయటకు పోయేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో వరి ఆకుమడులతోపాటు సరుగుడు, యూకలిప్టస్ మొక్కలు, వంగ, బీర, బెండ, టమాటా, మిరప తోటల్లో నీరు చేరడంతో రైతులకు నష్టం జరిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్లలో నిండుగా నీళ్లు చేరాయి. తెన్నేటి విశ్వనాథం పెద్దేరు రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.80 మీటర్లకు చేరింది. కళ్యాణపులోవ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 460 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 459 మీటర్లు ఉంది. కలెక్టరేట్‌లో మూడో రోజూ కంట్రోల్ రూమ్ కొనసాగింది. సీనియర్ అసిస్టెంట్ కె.జగజ్జీవనరావును 8074480904 నంబర్‌లో, జూనియర్ అసిస్టెంట్ జి.సత్యనారాయణను 9494933838 నంబర్‌లో సంప్రదించవచ్చు.

జిల్లాలో వర్షపాతం.. : జిల్లావ్యాప్తంగా శనివారం 67.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనకాపల్లి మండలం ఎరుకువానిపాలెంలో 144.25 మి.మీ, అత్యల్పంగా మునగపాక మండలం చూచుకొండ వద్ద 21 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నర్సీపట్నం టౌన్ 82.5 మి.మీ, నర్సీపట్నం మండలం జోగినాధునిపాలెం 81.25, అనకాపల్లి కోడూరు 76.0, కోటవురట్ల కైలాసపట్నం 74.25, పరవాడ ఎదురువానిపాలెం 73.5. దేవరాపల్లి 69.25, యలమంచిలి కొక్కిరాపల్లి 58.5, రావికమతం కొత్తకోట 56.75, చీడికాడ 52, అచ్యుతాపురం 49.5, నక్కపల్లి వేంపాడు 48.5, మునగపాక 48.25, ఎస్.రాయవరంలో 43.25, ఎస్.రాయవరం దార్లపూడిలో 23.25 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆకుమడుల్లో వర్షం నీటిని తొలగించాలి



సీతానగరంలో ఆకుమడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు

అనకాపల్లి: వర్షాల కారణంగా ఆకు మడుల్లో చేరిన నీటిని కాలువల ద్వారా బయటకు పంపించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని సీతానగరంలో ఆకుమడులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారు మడుల్లో నీటిని తొలగించిన తరువాత నాలుగుసెంట్ల నారుమడికి ఒక కేజీ పొటాషియం, ఒక కేజీ యూరియా కలిపి వేయాలని సూచించారు. నారు మడులు పూర్తిగా దెబ్బతింటే వరిదుంప నారుమడులు వేసు కోవాలని తెలిపారు. గుర్తింపు కార్డుల కోసం కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఎం.శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మాకవరపాలెం: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జి.వెంకటాపురం శివారు సుభద్రయ్యపాలెం గ్రామానికి చెందిన పైల రత్నం(20)కి ఇదే గ్రామానికి చెందిన నూకరాజుతో మూడేళ్ల కిందట వివాహమైంది. నూకరాజు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రత్నం మామ చల్లయ్యకు పక్షవాతం రావడంతో కొంతకాలంగా మంచం పట్టాడు. ఆయనకు సపర్యలు చేయలేక మనస్తాపానికి గురైన రత్నం శుక్రవారం రాత్రి ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మాకవరపాలెం పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె మరణించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు శనివారం తెలిపారు.

పిట్ట కొంచెం.. చిత్రం ఘనం



రోహిత్ పెన్సిల్‌తో అందంగా గీసిన శ్రీరాముడు, హనుమంతుడు ఆలింగనం రూపం, శ్రీరాముని రూపం, ఛత్రపతి శివాజీ రూపం, బ్రూస్లీ రూపం

- 5వ తరగతి విద్యార్థి రోహిత్ సృజనాత్మకత
- పెన్సిళ్లతో అద్భుతమైన చిత్రాలు

మాడుగుల రూరల్: ఆ చిన్నారి అద్భుతమైన చిత్రాలు గీస్తూ ఔరా అనిపిస్తున్నాడు. బాల్యంలోనే చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకుని అందమైన ఆకృతులను గీసి అబ్బుర పరుస్తున్నాడు. పదేళ్ల ప్రాయంలోనే తన సృజనాత్మకతకు పదును పెడుతున్నాడు. మాడుగులకు చెందిన పుట్టా చిన హనుమంతురావు, సుహాసిని దంపతుల పెద్ద కుమారుడు రోహిత్ పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. మాడుగుల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల (గెడ్డబడి)లో ఐదో తరగతి చదువుతున్న రోహిత్ ఖాళీ సమయంలో చిత్రాలు గీయడం హాబీగా పెట్టుకున్నాడు. అతని ప్రతిభను గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. దాంతో పెన్సిల్, స్కెచ్ పెన్సిల్ తోపాటు పెన్నులు ఉపయోగించి చిత్రాలు గీస్తున్నాడు. కలర్ పెయింటింగ్ వేస్తున్నాడు. ప్రధానంగా దేవతామూర్తులు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, హనుమంతుడు, స్వాతంత్ర్య సమరయోధులు, ఛత్రపతి శివాజీ, కరెన్సీ నోట్లను స్కెచ్ పెన్సిల్‌తో అందంగా వేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు పలు పర్యాయాలు అభినందించారు.



రోహిత్ గీసిన 500 రూపాయల నోటు చిత్రం

చీడపీడల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

అనకాపల్లి: వర్షాల కారణంగా పంటలు చీడపీడల బారిన పడే ప్రమాదం ఉన్నందున రైతులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని పంటలను కాపాడుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అగ్గితెగులు, గోధుమ రంగు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని చెప్పారు. వీటి నివారణకు కార్బెండజిం 1.0 గ్రాములను.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొడతెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2.0 మిల్లీలీటర్ల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాల కారణంగా వరిలో కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపుమందును ఎకరానికి 80–100 గ్రాముల చొప్పున 20–25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4–7 రోజుల్లో వేసుకోవాలన్నారు. నారుమడి విత్తిన పది రోజులకు సెంటుకు 150 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలను వేసుకోవాలన్నారు.చెరకుకు మొవ్వకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కార్బెండిజిమ్ ఒక గ్రామ లేదా మాంకోజెబ్ 3గ్రాములకు లీటరు నీటిని కలిపి తెగులు ఉధృతిని బట్టి 10–15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసి నివారించవచ్చున్నారు. 120 రోజుల వయసు గల చెరకు పైరులో మొక్కల వరుసల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని, పంట ఎదుగుదలను బట్టి మొవ్వులో 8 ఆకులు వదిలి జడచుట్టు వేసుకుంటే గాలులకు తోట పడిపోకుండా ఉందని ఆయన పేర్కొన్నారు.

వర్షాధార చెరకులో..

వర్షాధార చెరకులో పేనుబంక పురుగు ఆశించే అవకాశం ఉందని, చెరకులో పసుపు ఆకు తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉన్నందున లీటరు నీటికి డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లకు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయడం వల్ల పేనుబంక, కాండం తొలిచే పురుగును నివారించవచ్చని ఆయన చెప్పారు.

చెరకులో పీక పురుగు...

30 రోజుల దాటిన వర్షాధార చెరకులో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా పీకపురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు మోనోక్రోటోఫాస్ లేదా క్లోరాన్ట్రనిలిప్రోల్‌ను నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ట్రైకోగ్రామా ఖిలోనిస్ గుడ్లు పరాన్నజీవిని ఎకరాకు 20 వేల చొప్పున చెరకు నాటిన 30రోజుల నుంచి 7–10 రోజుల వ్యవధిలో 4–6 సార్లు విడుల చేయాలన్నారు.

నువ్వులు...

నువ్వుల్లో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని నివారణకు కార్బెండజిం 1 గ్రాము లేదా మంకోజెబ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

మిర్చి సాగులో సూచనలు

కూరగాయ పంటలలో మిర్చి నారుమడి వేసుకునే రైతులు మేటలాక్సిల్ 2గ్రాములు లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును 3 గ్రాములను లీటరు నీటికి కలిపి నారుమడి తడిచేలా పిచికారీ చేయాలన్నారు. నారుమడిలో నీరు నిలవకుండా చూడాలని సూచించారు.కొబ్బరి, మామిడి, జీడిమామిడి తోటల్లో పచ్చిరొట్టపైర్లను పూత దశలో నేలలో కలియదున్నాలని ఆయన సూచించారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా కేకే (కొత్తవలస–కిరండూల్) లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 21, 22వ తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. 21, 22, 23వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయలుదేరుతుంది.
- విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 23వ తేదీల్లో మళ్లించిన మార్గంలో వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. 21, 22, 23వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయలుదేరి మళ్లించబడిన మార్గంలో వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖపట్నం చేరుకుంటుంది.

28న పెద్దేరు, వచ్చే నెల 2న రైవాడ నీరు విడుదల

దేవరాపల్లి: ఖరీఫ్ సాగుకు ఆగస్టు 2న రైవాడ జలాశయం నీటిని విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఇరిగేషన్ అధికార్లను ఆదేశించారు. రైవాడ అతిథి గృహంలో ఆయకట్టుకు నీటి విడుదలపై ఇరిగేషన్ అధికార్లు, రైతులతో శనివారం సమావేశమయ్యారు. రైతుల వినతి మేరకు వచ్చే నెల 2న ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. పెద్దేరు నీటిని ఈ నెల 28న ఖరీఫ్ సాగుకు విడుదల చేస్తామన్నారు. అంతకు ముందు ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడుతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సాగు నీటి విడుదలలోగా ఆయకట్టుకు నిరాటంకంగా సాగునీరందించేందుకు ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేయించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన రైవాడ ఆధునీకరణ పనులను పునఃప్రారంభించేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని ఇరిగేషన్ అధికార్లకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, అధికార్లు, రైతులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల దాడిలో ఒకరికి గాయాలు



వీరవల్లి గణేష్ తలపై అయిన గాయం

చోడవరం : రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన వెల్లంకి త్రిమూర్తులు, ఇతని కుమారుడు వెల్లంకి గణేష్‌లు దాడి చేసి ఇదే గ్రామానికి చెందిన వీరవల్లి గణేష్‌ను గాయపరిచారు. వెల్లంకి త్రిమూర్తులు,వీరవల్లి గణేష్‌లు మధ్య గత కొద్ది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం ఇంటి దగ్గరలో వీరిద్దరూ మరో సారి గొడవకు దిగారు. వీరవల్లి గణేష్, వెల్లంకి త్రిమూర్తులు గొడవ పడుతుండగా అక్కడకు త్రిమూర్తులు కుమారుడు వెల్లంకి గణేష్ కూడా వెళ్లాడు. తండ్రీకొడుకులిద్దరూ కలిసి వీరవల్లి గణేష్ తలపై ఇనుపరాడ్డుతో దాడి చేశారు. బాధితుడు గణేష్ భార్య నీల ఫిర్యాదు మేరకు కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. గాయపడిన వీరవల్లి గణేష్‌ను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాము కాటుతో రైతు మృతి



అన్నంనాయుడు(ఫైల్)

దేవరాపల్లి: మండలంలో కలిగొట్లలో పాము కాటుకు గురై గ్రామానికి చెందిన రైతు గొర్రిపోటు అన్నంనాయుడు(72) శనివారం మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నంనాయుడు తమ పశువుల పాక సమీపంలోని సరుగుడు నారు మొక్కలను నాటేందుకు సిద్ధమవుతుండగా అక్కడే ఉన్న పాము అతని కాలుపై కాటేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న అతనిని స్థానికులు వెంటనే వేచలం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని మృతుడి కుటుంబ సభ్యులు చెప్పారు. మృతుడికి భార్య దేముడమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

డీసీపీ–1గా అజితా వేజెండ్ల బాధ్యతల స్వీకరణ



తాటిచెట్లపాలెం(విశాఖ): నగర డీసీపీ–1(లా అండ్ ఆర్డర్)గా అజితా వేజెండ్ల శనివారం కమిషనరేట్‌లోని లా అండ్ ఆర్డర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించి.. బదిలీపై విశాఖకు వచ్చారు. గతంలో ఆమె నగర ఎస్‌ఈబీలో ఏడీసీపీగా పనిచేశారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి

తుమ్మపాల: జిల్లా అభివృద్ధికి సీఎం చంద్రబాబు కార్యాచరణ మొదలుపెట్టారని ఎంపీ సీఎం రమేష్ చెప్పారు. పట్టణంలో ఎంపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం రూపురేఖలు మార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం కెనాల్‌ను రూ.800 కోట్లతో అనకాపల్లి వరకు నిర్మిస్తున్నారని తెలిపారు. అనకాపల్లి –రాజమండ్రి రోడ్డును ఆరు లైన్ల రహదారిగా విస్తరించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయగా సానుకూలంగా స్పందించారన్నారు.

వారం రోజుల్లో మంజూరు చేసి టెండర్లకు సిఫార్సు చేయాలని అధికారులకు ఆదేశాలు చేశారన్నారు. జాతీయ రహదారిగా ఉన్న లంకెలపాలెం–అనకాపల్లి రోడ్డును స్టేట్ హైవేగా చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేటప్పుడు ఆ రహదారికి మరమ్మతులు చేసి, అభివృద్ధి చేయాల్సి ఉంటుందని.. అయితే దానికి బదులు లంకెలపాలెం నుంచి అనకాపల్లి వరకు డైరెక్ట్ ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరామన్నారు.

సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం చేయాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి



పోర్టు ఉద్యోగులతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్

ఉక్కునగరం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ శనివారం స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించారు. ముందుగా ఆయన స్టీల్‌ప్లాంట్ ఈడీ(వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఉన్నతాధికారులు ప్లాంట్ లే అవుట్, ఉత్పత్తి ప్రక్రియ, ముడి పదార్థాలు, ఉత్పత్తుల రవాణా గురించి వివరించారు. అనంతరం ఆయన ప్లాంట్‌లో కొన్ని ప్రధాన విభాగాలను సందర్శించి అక్కడ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఉక్కు హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఎస్సీ, ఎస్టీ అధికారుల పదోన్నతుల్లో జాప్యం జరుగుతోందని, విభాగాధిపతులుగా ఎస్టీ అధికారులను నియమించాలని, కాంట్రాక్ట్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు జేవో పదోన్నతులు కల్పించాలని, ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలని అందులో పేర్కొ న్నారు. అనంతరం యాజమాన్యంతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీఎండీ అతుల్ భట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. డైరెక్టర్లు ఎ.కె.బాగ్చి, ఎస్.సి.పాండే, గణేష్, జి.వి.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు సందర్శన

సాక్షి, విశాఖపట్నం: ప్రతి సంస్థలోనూ ఉద్యోగులకు సమగ్ర సౌకర్యాలు కల్పించేందుకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ సూచించారు. తెలంగాణ, ఏపీ ఎస్టీ కమిషన్ మెంబర్ పీఎస్ అశోక్ కుమార్ లక్కార్స్, కమిషన్ మెంబర్ సలహాదారు పి.వి.రమణతో కలిసి హుస్సేన్ విశాఖపట్నం పోర్టులో శనివారం పర్యటించారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే కమిషన్ బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న ఎగుమతులు దిగుమతులు, మౌలిక వసతుల కల్పన, యాంత్రీకరణ, ఆధునికీకరణ, ఎస్టీ కమ్యూనిటి కోసం వినియోగిస్తున్న సీఎస్సార్ నిధుల వివరాలు తదితర అంశాలను డిప్యూటీ చైర్మన్ దూబే.. కమిషన్ బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పోర్టులోని ఎస్టీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కమిషన్ మెంబర్ హుస్సేన్ సమావేశమయ్యారు.

కేజీహెచ్‌లో పీటీయూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

మహారాణిపేట(విశాఖ): అనవసరమైన గర్భసంచి తొలగింపు శస్త్రచికిత్సలను తగ్గించడానికి, మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రిజర్వ్ ద యుటెరస్ (పీటీయూ) సెంటర్ ప్రారంభించడం మంచి పరిణామమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. కేజీహెచ్‌లో పీటీయూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. హిస్టెక్టమీని ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బేయర్ ఫార్మాస్యూటికల్స్ డివిజన్, ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఓజీఎస్‌ఐ) భాగస్వామ్యంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ వైజాగ్‌లోని పీటీయూ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ దేశంలోనే మొదటిదన్నారు. ఈ ఆరోగ్య సవాల్‌ను ఎదుర్కోవడంలో తాము ముందున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. అధిక రక్తస్రావం వంటి పరిస్థితులకు చికిత్స చేయడంలో హిస్టెక్టమీ చివరి అవకాశంగా నిలిచేలా చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. బేయర్స్ ఫార్మాస్యూటికల్స్ విభాగం దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా అండ్ కంట్రీ డివిజన్ హెడ్ శ్వేతా రాయ్ మాట్లాడుతూ భారతదేశంలో అనవసరమైన గర్భాశయ శస్త్రచికిత్సల ప్రతికూల ప్రభావం గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. ఎఫ్‌ఓజీఎస్‌ఐ పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రియాంకుర్ రాయ్, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, విక్టోరియా ఆస్పత్రి గైనిక్ వైద్యురాలు డాక్టర్ గీతావందన, ఆంకో గైనకాలజిస్ట్ డాక్టర్ సాయి లక్ష్మి సెషన్లకు నాయకత్వం వహించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శారదానదికి వరద నీటి తాకిడి



కశింకోటలో నిండుగా ప్రవహిస్తున్న శారదానది

కశింకోట: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు శనివారం మధ్యాహ్నానికి తగ్గుముఖం పట్టాయి. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజులపాటు ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షాలకు శారదానది నీటి మట్టం పెరిగింది. శుక్రవారం 60.6 మి.మీ. వర్షపాతం నమోదుకాగా, శనివారం 73.6 మి.మీ. వర్షపాతం నమోదయింది. శారదానది ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో వరద నీరు చేరి, నీటి మట్టం పెరిగి ఎర్ర రంగుతో ప్రవహిస్తోంది. మండలంలోని తాళ్లపాలెం వద్ద మామిడివాక గెడ్డ కూడా వర్షపు వరద నీటితో ప్రవహిస్తోంది. కశింకోటలో లోతట్టు ప్రాంతాలైన స్థానిక పీహెచ్‌సీ, మండల పరిషత్ కార్యాలయం వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా పంచాయతీ సిబ్బంది కాలువను శుభ్రపరిచి తొలగింపు చర్యలు చేపట్టారు.

త్వరలో బీజేపీ సభ్యత్వ సమోదు

అనకాపల్లి: గ్రామీణ స్థాయి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని త్వరలోనే పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఎంపీ సీఎం రమేష్ అన్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్ మాధవ సదన్ హాల్లో శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలకు సేవ చేయకుండా ఫొటోలకు పరిమితమైతే ప్రజల్లో నమ్మకం కోల్పోతామని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి ఎన్.మధుకర్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్లె శ్రీరామ్మూర్తి, పొన్నగంటి అప్పారావు, జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, రాష్ట్ర నాయకులు పి.రవిరాజు, కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య సలహాలు

ఎస్.రాయవరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ సూచించారు. సర్వసిద్ధి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముందన్నారు. ఇళ్లలో నీటికి బాగా మరిగించి, వడబోసి, చల్లారాక తాగాలన్నారు. దోమల వ్యాప్తి నిరోధక చర్యల్ని వివరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 22 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడోరకం	3,000	3,410

అనకాపల్లి సినిమాలు

పేకమేడలు	: రాజా
కల్కి 2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి 2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-2
డార్లింగ్	: షిర్డిసాయి
భారతీయుడు 2	: పర్తిసాయి
క్రైం రీల్	: వెంకటేశ్వర
నరబలి	: శ్రీసత్య
ద బర్త్‌డే బోయ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 96 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-45 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 325 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 256 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ప్లాస్టిక్ నిషేధమా.. అదెక్కడ?

- నిషేధాజ్ఞలు ఉన్నా విచ్చలవిడి వినియోగం
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు
- ఆర్‌ఆర్‌ఆర్‌పై కొరవడిన చైతన్యం

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పని తెలిసినా దొంగచాటుగా విక్రయాలు, కొనుగోళ్లు జరుగుతూనే ఉన్నాయి. దీన్ని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2022 జూలై నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశాల మేరకు అనకాపల్లి పట్టణ పరిధిలో జీవీఎంసీ జోనల్ అధికారులు రంగంలోకి దిగారు. నెలలు గడుస్తున్నకొద్దీ వీరిలో నిర్లిప్తత నెలకొంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయి.

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు సామాజిక బాధ్యత. సమష్టి కృషితోనే అది సాధ్యం. పర్యావరణానికి తీరని హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంలో జీవీఎంసీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డు పక్కనున్న టీ స్టాళ్ల నుంచి బడా దుకాణాల వరకు నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నా.. పట్టించుకున్న పాపానపోవట్లేదు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే అడపాదడపా దాడులు జరిపి, కేసులు రాయడం మినహా క్షేత్రస్థాయి సిబ్బంది కఠినంగా వ్యవహరించట్లేదన్న ఆక్షేపణలున్నాయి.

ప్లాస్టిక్‌తో అనారోగ్యం

ఇటీవల కాలంలో ప్లాస్టిక్ కవర్లలో వేడి వస్తువులు ప్యాక్ చేయడం, ప్లాస్టిక్ కప్పుల్లో టీ, కాఫీ సేవనం ద్వారా కొద్దిపాటి ప్లాస్టిక్ అవశేషాలు కరిగి మన శరీరంలో ప్రవేశిస్తాయి. వీటిలో ఉండే లాస్టిసైజర్లు, తక్కువ-మాలిక్యులర్ సమ్మేళనాలు, రంగుల కోసం వాడే విషపూరిత రసాయనాలు ఆహార పదార్థాల ద్వారా మనలో చేరి క్యాన్సర్ కారకంగా మారే అవకాశం ఉంది. ప్లాస్టిక్ సంచుల తయారీలో కాడ్మియం, జింక్ వంటి విషపూరిత లోహాలు ఉపయోగించినప్పుడు, అవి వేడిగా ఉండే ఆహార పదార్థాలను విషపూరితంగా మార్చేస్తాయి. దీంతో మనకు తెలియకుండానే దీర్ఘకాలిక రోగాలకు గురయ్యే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌లోని డయాక్సిన్ల వల్ల మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుంది. ఈ మధ్యకాలంలో వందల సంఖ్యలో పశువుల మరణాలకు ప్లాస్టిక్ సంచులే కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రోజూ టన్నుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు

చిన్న దుకాణాల నుంచి కార్పొరేట్ దుకాణాల వరకూ నిత్యం టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. తక్కువ మైక్రాన్లున్న ప్లాస్టిక్



మెయిన్‌రోడ్డులో ప్లాస్టిక్ వాడుతున్న దుకాణంపై కేసు రాస్తున్న జీవీఎంసీ ఉద్యోగులు(ఫైల్)

భూమిలో కరగాలంటే వందల ఏళ్లు పడుతుంది. ఒక్కోసారి వెయ్యేళ్లైనా ప్లాస్టిక్ అవశేషాలు భూమిలో కరగని పరిస్థితి. దీంతో భూవాతావరణంలో మార్పులు సంభవించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఒక్క అనకాపల్లి జోన్ పరిధిలోనే రోజుకు సుమారు 30–35 టన్నుల ప్లాస్టిక్ చెత్తను పారిశుద్ధ్య విభాగం సిబ్బంది సేకరిస్తున్నారు. వీరి దృష్టికి రాకుండా టీదుకాణాలు, చిరువ్యాపారులు, హోటళ్లు, రెస్టారెంట్లు, కూరగాయల దుకాణాల ద్వారా పేరుకుపోయే ప్లాస్టిక్ వ్యర్థాలు అంతే స్థాయిలో ఉంటాయంటే అతిశయోక్తి కాదు.

ప్రత్యామ్నాయాల వైపు మళ్లాల్సిందే..!

ఇప్పటికే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) నినాదంతో ప్రజల్లో చైతన్యం పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రజలు కూడా తమంత తాముగా ప్లాస్టిక్ వినియోగానికి కట్టుబడి ఉండాలని చెప్తోంది. సరకుల కోసం వెళ్లేటపుడు ఇంటి నుంచే సొంత బ్యాగులు, గుడ్డ, నార సంచులు తీసుకెళ్లాల్సిందిగా ప్రచారం చేస్తోంది. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాల్సిందేనని అధికారులు కోరుతున్నారు. అలా జరిగితేనే భావితరాల వారికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించిన వారిమవుతామని చెప్తున్నారు. ప్రసుత్తం పండగల సీజన్ మొదలైంది. మరో 15 రోజుల్లో శ్రావణమాసం ప్రారంభం కానుంది. దేవాలయాల వద్ద ప్రసాద వితరణ, కూరగాయలు, పువ్వుల దుకాణాలు, టీషాప్‌లు, హోటళ్లలో తొలిదశగా జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకుంటే 60 శాతం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించినట్లేనని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు. పెద్ద దేవాలయాల్లో ఇప్పటికే పేపర్ ప్లేట్లు, ఆకుల్లో ప్రసాద వితరణ చేస్తున్నారు. మిగిలిన చోట్ల కూడా అమలయ్యేలా చూడాలి.

అవగాహన పెంచాలి



పట్టణ పరిధిలో నిత్యం టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వాడకం పెరిగిపోతుంది. డ్రైనేజీలు పూడుకుపోవడానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ వ్యర్థాలే. పరిశుభ్రమైన వాతావరణంలో మన తర్వాతి తరాలు కూడా జీవించాలంటే పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను నిషేధించాలి. గతంలో ప్లాస్టిక్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. నేటి సమాజంలో ప్లాస్టిక్‌పైనే ప్రజలు పూర్తిగా ఆధారపడిపోతున్నారు. గుడ్డ, నార సంచులు వినియోగించేలా మార్పు రావాలి.

– షేక్ ఖాన్, వ్యాపారి, అనకాపల్లి

ప్లాస్టిక్ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్



పట్టణ పరిధిలో అన్ని రకాల దుకాణాలు 2,357 ఉన్నాయి. 125 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమల్లో ఉంది. ప్లాస్టిక్ నిర్మూలన చర్యల్లో భాగంగా విశాఖ నుంచి ప్రతీ రోజు ఒక టీమ్ వస్తుంది. జోన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తుంది. ఇప్పటి వరకు 111 చలనాల ద్వారా రూ.4 లక్షల 11 వేలు అపరాధ రుసుములు విధించాం. దుకాణ యజమానులతో పాటు, ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఒమ్మి అప్పలనాయుడు, జెడ్సీ, అనకాపల్లి జోన్

గవరపేటలో ఏకాహం



కశింకోటలోని గవరపేటలో ఏకాహం భజన కార్యక్రమంలో భక్తులు

కశింకోట: స్థానిక గవరపేటలో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దనున్న ఆశ్రమంలో 24 గంటల భజన కార్యక్రమం ఏకాహంను శనివారం చేపట్టారు. ఆదివారం గురు పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరి నామ స్మరణ చేశారు. ఆదివారం ఏకాహం ముగియనుందని నిర్వాహకులు తెలిపారు.

వజ్రకవచాలంకరణలో ధ్యాన వేంకటేశుడు



కశింకోట: స్థానిక శివాలయం వద్ద ఉన్న ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామిని వివిధ రకాల పూల దండలు, తులసీ మాలలతోపాటు వజ్ర కవచంతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేడు గురుపౌర్ణమి ఉత్సవం

కశింకోట: స్థానిక కోనేరు వద్ద కొలువైన షిర్డీ సాయి బాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు అర్చకుడు ఎ.గోపాలకృష్ణ, ఆలయ ప్రధాన కార్యదర్శి కె.రాజారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు సాయిబాబాకు పంచామృతాలు, వివిధ పండ్ల రసాలు, విభూతి, చందనాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్‌వీఎస్ఎన్ రెడ్డి(శ్రీనురెడ్డి), అరుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

వైభవంగా వేంకటేశుని పవిత్రోత్సవాలు



ఉత్సవ మూర్తులకు నవకలశ స్నపనం అభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామివారి భజనలు చేస్తున్న భక్త బృందం

అనకాపల్లి: దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక దేమునిగుమ్మం అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు పవిత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, నవకలశ స్నపనం, అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, అర్చకులు ప్రసాద్, రాజేష్, కూటమి నేతలు సకలా గోవింద్, పీలా నాగశ్రీను, భీమరశెట్టి చిన్ని, దూలం గోపి, గోలి మురళి తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడుల్లో సస్య రక్షణ చర్యలు తప్పనిసరి



నీట మునిగిన వరినారు మడులను పరిశీలిస్తున్న ఏవో రంగాచారి, హనుమంతరావు



కశింకోటలో నీట మునిగిన నారుమడుల్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి స్వప్న

తుమ్మపాల: ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరినారు మడుల్ని కాపాడుకునేందుకు బోదులు వేసి, నీటిని తొలగించాలని, తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి రైతులకు సూచించారు. మండలంలోని తుమ్మపాల, శంకరం గ్రామాల్లో వరి నారుమడులను, ఎదజల్లిన వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. నీరు తగ్గిన తర్వాత నాలుగు సెంట్ల నారు ముడికి కిలో పొటాష్, కిలో యూరియా కలిపి వేయాలన్నారు. నారుమడులు పూర్తిగా దెబ్బతిన్న చోట వరి దుంప నారుమడులు వేసుకోవాలన్నారు. కౌలు రైతులు గ్రామ రెవెన్యూ అధికారులను కలిసి గుర్తింపు కార్డులు కోసం అర్జీ పెట్టుకోవాలని సూచించారు. వరి నారుమడిలో తెగులు సోకినట్లయితే లీటర్ నీటికి 2 గ్రాముల కార్బండిజం, లీటర్ నీటికి మాంకోజాబ్ 2 గ్రాములు కలిపి స్ప్రే చేయాలన్నారు. శంకరం బొజ్జన్నకొండ రహదారి వద్ద పంట కాలువల్లో పూడిక కారణంగా దిగువకు ప్రవాహం లేక నీరు నిలిచిన పొలాల్లో ఆకుమడులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, జాగ్రత్తపడాలని రైతుల్ని హెచ్చరించారు. తుప్పలతో మూసుకుపోయిన కాలువలను త్వరలోనే శుభ్రం చేస్తామని ఇరిగేషన్ ఏఈ హనుమంతరావు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, రైతు నాయకులు పీలా బుజ్జి, వేగి వెంకట కన్నఅప్పారావు, కొణతాల నాగేశ్వరరావు, మోదునాయుడు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాలకు నీటమునిగిన వరి నారుమడులను మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు నారుమడుల సంరక్షణపై పలు సూచనలు చేశారు. నారుమడుల్లో బోదులు తీసి అదనపు నీటిని వెంటనే తొలగించాలన్నారు. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం గ్రామాల్లో పర్యటించి, రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు.

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ లూసీ కార్డిలియా



శంకరం గ్రామంలో గర్భిణులకు రక్త పరీక్ష చేస్తున్న ఏఎన్‌ఎం

అనకాపల్లి: గ్రామీణ స్థాయి నుంచి వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యావిభాగం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ లూసీ కార్డిలియా సూచించారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీ పరిధి శంకరం పంచాయతీలో వైద్య విభాగం రికార్డులను శనివారం ఆమె పరిశీలించి, మాట్లాడారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. వర్షాలు పడుతున్న సమయంలో జ్వరాల బారిన పడే రోగులకు తక్షణ మే వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భిణులకు, బాలింతలకు, విద్యార్థులకు ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు జరిపి, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. అంతకు ముందు ఆమె శంకరం, బట్లపూడి, రాయుడుపేట లో గర్భిణులకు, విద్యార్థులకు రక్తపరీక్షలు చేయించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యు లు ఎ.రామచంద్రరావు, జగదీష్, నానాజీ, జనార్దన్, డి.నాగమణి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యసిబ్బంది బి.సంఘం, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పూరిల్లు



ముత్యాలమ్మపాలెంలో పాక్షికంగా దెబ్బతిన్న పూరిల్లును పరిశీలిస్తున్న సర్పంచ్

పరవాడ: మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం గ్రామానికి చెందిన చింతకాయల ముత్యాలకు చెందిన పూరిల్లు పాక్షికంగా దెబ్బతింది. వర్షాలకు నీరు ఇంట్లోకి చేరడంతో గోడలు నాని పోయి పాక్షికంగా దెబ్బతిన్నాయని బాధితుడు ముత్యాలు చెప్పారు. సమాచారం అందిన వెంటనే సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు బాధితులను పరామర్శించారు. వీఆర్వో కమల ఇంటిని సందర్శించి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తామని చెప్పారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



అమ్మవారి ఆలయంలో నారాయణినామ సంకీర్తనలో మహిళా భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం, నవకలశ స్నపనము, నీరాజన మంత్ర పుష్పములు, గోపూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామణాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ మండపంలో 49 కలశాలతో స్నపనము, శాంతి హోమం జరిపారు. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదవితరణ చేశారు. కాకినాడ వాస్తవ్యులు నారాయణి అంత్యాక్షరిలో గిన్నీస్‌బుక్ రికార్డు గ్రహీత గ్రంధి తాయారు ఆధ్వర్యంలో నారాయణినామ ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన వర్షాలు



ముత్యాలమ్మపాలెం తీరంలో వలలను సరిచేసుకొంటున్న మత్స్యకార్మికులు

పరవాడ: తుపాను కారణంగా రెండు రోజులుగా మండలంలో ఎడ తెరిపిలేకుండా కురిసిన వర్షాలు శనివారం తగ్గుముఖం పట్టాయి. అయితే మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు ఉధృతి అధికమైంది. ముత్యాలమ్మపాలెం తీరం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి ఈదురుగాలులు జోరుగా వీస్తున్నాయి. కెరటాలు తీరాన్ని బలంగా తాకుతున్నాయి. మత్స్యకారులు నాలుగు రోజులుగా చేపల వేటకు స్వస్తి చెప్పి ఇళ్లకు పరిమితమై వలలను సరిచేసుకుంటున్నారు. ప్రస్తుతం వీస్తున్న ఈదురు గాలులకు భర్నికం గ్రామంలో విద్యుత్ స్తంభం కూలిపోగా దిబ్బపాలెంలో ఓ పూరిల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈదురుగాలులకు మండలంలో అరటి, బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లుతుందని తానాం, వెన్నలపాలెం, మెట్టపాలెం తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నారుమడుల్లో నీరు చేరింది. మండలంలో10.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు.

నేడు యానాద్రి అమ్మవారి జాతర

యలమంచిలి రూరల్: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో కొలువైన యానాద్రి అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం జరగనుంది. ఏటా ఆషాఢమాసం చివరి ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన బంధుమిత్రులు ఇప్పటికే యలమంచిలి చేరుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది.

'త్వరితగతిన ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులు'

తుమ్మపాల: రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియం, రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్రతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు చివరి వారంలో రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఇక్కడ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, డీఈ రవి, ఈఈ సింగ్, సంజీవ్, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘ కార్యదర్శి గుమ్మాల వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులపై కుక్కల దాడి

యలమంచిలి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై శనివారం వీధి కుక్కలు దాడి చేశాయి. కళాశాల నుంచి బయటికొస్తున్న సమయంలో వీరిపై కుక్కల గుంపు వెంటపడి దాడి చేయడంతో గాయపడ్డారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం పట్టణంలోని నాగేంద్ర కాలనీలో ఇంటి బయట ఆడుకుంటున్న ఇద్దరు బాలికలపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వీరిద్దరినీ యలమంచిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్చి, చికిత్స అందించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువ కావడంతో, వాటి బారిన పడిన బాధితుల సంఖ్య పెరుగుతోంది. వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

ముగిసిన శ్రీ విద్య ఉపాసన తరగతులు



శ్రీవిద్య ఉపాసస తరగతులకు హాజరైన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో ఈ నెల 16 తేదీ నుంచి నిర్వహించిన శ్రీవిద్య ఉపాసన తరగతులు ముగిశాయని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న వారిని అభినందించారు. ఆమె మాట్లాడుతూ గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.